సాక్షి
గుంటూరు
శనివారం, 15, మార్చి, 2025



వైభవంగా బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు : పెదపులివర్రులోని శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం నిర్వహించారు.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

తెనాలి: బాలాజీరావుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం పెద్ద రథం ఊరేగింపు జరిగింది.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



దాచేపల్లి : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాశెట్టి బుజ్జి, సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6.23	4.59
నరసరావుపేట	6.25	5.01
బాపట్ల	6.23	4.59

న్యూస్‌రీల్

16 నెలల్లో నిడమర్రు రైల్వే గేటుపై వంతెన నిర్మాణం పూర్తి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్



మంగళగిరి: మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం యర్రబాలెంలో ఆధునికీకరించిన శ్రీ భగవాన్ మహవీర్ గోశాలను, కొత్త భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నిడమర్రు రైల్వే గేటు వంతెన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 16 నెలల్లోపు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు మరో రెండు వారాలలో పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, ఆకుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

డీఈఓ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం నుంచి విద్యార్థులకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. టెన్త్ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా, గ్రామ పంచాయతీ, వైద్యారోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పాఠశాలల్లో అందుబాటు ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంలో సేవా సంస్థలు, స్థానికుల సహకారంతో మజ్జిగ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

విజయకీలాద్రిపై ఫాల్గుణ పౌర్ణమి వేడుక



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయ కీలాద్రి దివ్యక్షేత్రంలో ఫాల్గుణ మాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో ఉదయం 9 గంటలకు లక్ష్మీ అమ్మవారికి అభిషేకం, అనంతరం 9.30 గంటలకు లక్ష్మీ హయగ్రీవ హోమం అత్యంత వైభవంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారని తెలియజేశారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

చీరాల: వివాహేతర సంబంధం పెట్టుకుని ఘర్షణకు దిగిన కానిస్టేబుల్‌పై వివాహితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చీరాల డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ కొంతకాలంగా పేరాలకు చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వివాహిత బంధువులు ఈ విషయాన్ని ప్రశ్నించి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఘాతూకాలు

వ్యాపార సంస్థల స్వార్థం.. వినియోగదారును నిత్యం బలిపీఠం ఎక్కిస్తోంది. తూకం, నాణ్యత, ధర, వస్తు సేవల్లో దగా రాజ్యమేలుతోంది. పారదర్శకతకు పాతరేస్తోంది. చట్టాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం శాపంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్ల వ్యాపారులు మరింత పేట్రేగిపోతున్నారు. వజ్రాయుధంలాంటి వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై విస్తృత అవగాహన కల్పించడం వల్ల మోసాలకు చెక్ పెట్టవచ్చని వినియోగదారు హక్కుల సంఘాల నాయకులు చెబుతున్నారు. నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యం చేసే చిరుప్రయత్నమిది..

- దగా పడుతున్న వినియోగదారులు
- వ్యాపార సంస్థల స్వార్థమే శాపం
- పట్టించుకోని అధికారయంత్రాంగం
- జిల్లా వినియోగదారుల ఫోరమ్‌లో 580 కేసులు పెండింగ్
- రియల్ ఎస్టేట్, అపార్ట్‌మెంట్ నిర్వహణ కేసులే ఎక్కువ
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

అన్నింటా మోసం.. అవగాహన లోపం



ఇప్పటికీ వాడుతున్న రాళ్ల కాటా



ఈ ఏడాది తూనికలు, కొలతల శాఖ కేసులు ఇలా..

నెహ్రూనగర్, పట్నంబజార్ (గుంటూరు ఈస్ట్): ప్రస్తుతం సమాజంలో మోసాలు ఎక్కువయ్యాయి. తూకాల్లో ఘాతుకాలు పెరిగాయి. కల్తీ ఆహార పదార్థాలు భయపెడుతున్నాయి. పాలు, నీళ్లు నాణ్యత లేకుండా పోతున్నాయి. వీటిని అరికట్టాలంటే వినియోగదారులు మేల్కోవాలి. హక్కులపై అవగాహన పెంచుకోవాలి. వినియోగదారు హక్కుల పరిరక్షణ చట్టం, వినియోగదారుల ఫోరమ్, ఫిర్యాదులు ఎలా చేయాలి.. న్యాయం ఎలా పొందాలి వంటి అంశాల గురించి తెలుసుకోవాలి.



1986 నుంచి ప్రత్యేక చట్టం

భారతదేశంలో 1986లో వినియోగదారుల రక్షణ చట్టం రూపొందింది. అనంతర కాలంలో వాణిజ్య విధానాల్లో చాలా మార్పులొచ్చాయి. ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరిగాయి. మోసాలు విభిన్న రూపాలు సంతరించుకున్నాయి. ఈ క్రమంలో వినియోగదారుల హక్కుల చట్టానికి మరింత పదును పెట్టి 2019లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ పేరుతో కొత్త చట్టం తీసుకువచ్చారు. 2020 జూలైలో ఇది అమల్లోకి వచ్చింది. కొత్త చట్టంలో వినియోగదారుల రక్షణ మండళ్ల ఏర్పాటు, మధ్యవర్తిత్వ ప్యానెళ్లు, అన్యాయ వాణిజ్య పద్ధతులపై కఠిన చర్యలు వంటివి పొందుపరిచారు.

వినియోగదారుల ఫోరమ్‌లో కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైనవి
2024	365
2025	66 (ఇప్పటివరకు)

విలువను బట్టి స్థాయి..

జిల్లా స్థాయిలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్ ఉంటుంది. దీనినే వినియోగదారుల ఫోరమ్ అని కూడా పిలుస్తారు. వస్తు సేవల్లో లోపాలు జరిగితే ఈ కమిషన్(జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న కన్స్యూమర్ కోర్టు)లో లాయర్‌తో సంబంధం లేకుండా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో అయినా 1915, 1800114000 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమస్య చెబితే వారు జిల్లా స్థాయి కమిషన్‌కు తెలియజేస్తారు. 2024లో 365 కేసులు ఫైల్ అయ్యాయి, 2025 ఇప్పటి వరకు 66 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే కొన్నేళ్లుగా పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్న కేసులు 580 ఉన్నాయి. రూ.50 లక్షల విలువైన వస్తుసేవల కేసులను జిల్లా స్థాయిలో విచారణ చేస్తారు. ఆ తర్వాత రూ.2 కోట్ల వరకు విలువైన కేసులను రాష్ట్ర కమిషన్‌లో విచారణ చేస్తారు. ఆపైన విలువ ఉంటే జాతీయ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలి. కన్స్యూమర్ కోర్టులో ఎక్కువగా రియల్ ఎస్టేట్, అపార్ట్‌మెంట్ కొనుగోలు, ఆన్‌లైన్ మోసాలు, ఇన్సూరెన్స్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వంటి కేసులు నమోదవుతున్నట్లు సమాచారం.

ఎలక్ట్రానిక్ కాటాల సెట్టింగ్స్ మార్పు



ఎలక్ట్రానిక్ కాటాలో తేడా చూపిస్తున్న రాయి బరువు

ఎలక్ట్రానిక్ కాటాలు వచ్చినా ఇప్పటికీ తూకాల్లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు వ్యాపారులు పాత రాళ్ల కాటాలనే వాడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలు పెట్టుకున్నా.. 200 గ్రాములు తక్కువ తూగేలా సెట్టింగ్స్ చేసుకుంటున్నారు. ప్రముఖ మాల్స్, మార్టుల్లో లభ్యమైన ప్యాకేజీ వస్తువులూ తూకం తక్కువ ఉంటున్నాయి. నాణ్యత ప్రమాణాలు లేకుండా.. తూకంలో తేడాలు చేయడంపై తూనికలు కొలతలు శాఖ 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 576 కేసులు, ప్యాకేజ్డ్ కమోడిటీ మోసాలపై 426 కేసులు మొత్తం 1,002 కేసులు నమోదు చేసింది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- వస్తువు కొనేటప్పుడు నాణ్యత చూసుకోవాలి.
- గ్యారెంటీ, తూకం, ధర తనిఖీ చేసుకోవాలి.
- వ్యాపారి వద్ద కచ్చితంగా రశీదు తీసుకోవాలి. ఇన్‌వాయిస్‌లు, ఐడీలను భద్రపరుచుకోవాలి.

నిద్రావస్థలో అధికార యంత్రాంగం



ప్రస్తుతం మోసాలు పెరిగాయి. ఆహార కల్తీ జరుగుతోంది. తూకాల మోసాలు జరుగుతున్నాయి. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం నిద్రపోతోంది. దీంతో వ్యాపారస్తులు రెచ్చిపోతున్నారు. ఏదైనా సమస్యకు సంబంధించి ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందించడం లేదు. ఇది చాలా దారుణం.

– టీవీ కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ, జిల్లా వినియోగదారుల సంఘం

చట్టంపై అవగాహన పెంచుకోవాలి



బీమా పాలసీల క్లెయిముల్లోనూ మోసాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చాలా కేసుల్లో క్లెయిమ్‌లు పరిష్కారమయ్యేలా చూశాం. తూకాలు, వస్తు సేవల మోసాలపై న్యాయం చేసేందుకు వినియోగదారుల ఫోరమ్ ఉంది. వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి.

– పి.రామాంజనేయులు, వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు, అడ్వకేట్

ఫుడ్ సేఫ్టీ అధికారుల నియంత్రణేది?

ఆహారపదార్థాలనూ వ్యాపారులు కల్తీ చేస్తున్నారు. పండ్లలోనూ నాణ్యత ఉండడం లేదు. పండ్లను రసాయనాలతో పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. కూల్ డ్రింక్స్, చిన్నారుల తినుబండారాల్లో కెమికల్స్ వినియోగిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కనిపించడం లేదు.

నృసింహునికి బ్రహ్మరథం

మంగళాద్రిపై కొలువుదీరిన ఉగ్ర నారసింహుడు ఆనంద గర్జన చేస్తూ రథారూఢుడైనట్టు.. చెంతనున్న కృష్ణమ్మ జనప్రవాహమై పురవీధుల్లో పోటెత్తినట్టు.. అష్టదిక్పాలకుల జయజయధ్వానాలతో దక్షిణాభిముఖంగా కదిలినట్టు.. మంగళగిరి నగరం ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడింది. లక్ష్మీ నరసింహుని రథోత్సవానికి బ్రహ్మరథం పట్టింది.

- నమో నారసింహా
- మంగళాద్రి.. 'జన'దాద్రి
- అంగరంగ వైభవంగా నృసింహుని దివ్యరథోత్సవం

మంగళగిరి/మంగళగిరి టౌన్: జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళగిరి శుక్రవారం మార్మోగింది. శ్రీ లక్ష్మీనరసింహుని దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనంతో పురవీధులు కిటకిటలాడాయి. స్వామి బ్రహ్మోత్సవాలు 11 రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉభయదేవేరులతో స్వామి దివ్యరథాన్ని అధిరోహించారు. మూడు గంటల పాటు రథోత్సవం సాగింది. గాలిగోపురం నుంచి దక్షిణాభిముఖంగా ప్రారంభమైన రథం మెయిన్‌బజార్ మిద్దె సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వరకు కదలింది. అక్కడ ఆంజనేయస్వామి, వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తిరిగి రథోత్సవం గాలిగోపురం వద్దకు చేరుకుంది. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి ముగ్ధులయ్యారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాఢభూషి వేదాంతచార్యులు వ్యవహరించారు. పద్మశాలీయ శ్రీ లక్ష్మీనృసింహస్వామి రథ చప్పాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో ఎ.రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి రథాన్ని కొద్దిసేపు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లాగారు.



రథోత్సవానికి స్వామి, అమ్మవార్లను తోడ్కొని వస్తున్న అర్చకులు

బంగారు గరుడోత్సవం

గురువార రాత్రి స్వామి కల్యాణోత్సవం అనంతరం స్వామికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. గరుడోత్సవం శాశ్వత కల్యాణ కైంకర్యపరులుగా వాసిరెడ్డి సీతారామయ్య కుమారులు జయదత్తు, ప్రభునాథ్‌లు వ్యవహరించారు. బ్రాహ్మణ సమారాధన శాశ్వత కైంకర్యపరులుగా అరిపిరాల చిన్నఅప్పయ్య శాస్త్రి, మొక్కపాటి ఆనందయ్యలు వ్యవహించారు. ఈ ఉత్సవంలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



'హరి'విల్లె మెరిసే : విద్యుత్ దీప కాంతుల్లో మెరిసిపోతున్న స్వామి రథం, ఆలయ గోపురం

నేడు వైభవంగా శ్రీనివాస కల్యాణం

- 2,700 మంది తిలకించేలా ఏర్పాట్లు
- భక్తుల రాక కోసం 300 బస్సులు
- టీటీడీ ఈవో శ్యామలరావు



అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తాడికొండ: వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. శుక్రవారం ఆలయంలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ అధికారులు, జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2,700 మంది భక్తులు కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా 300 బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే కల్యాణోత్సవానికి ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పుష్పాలంకరణ పనులు వేగంగా చేస్తున్నారు. దాదాపు నాలుగు టన్నుల పూలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ పనులు చేస్తున్నారు. ఆలయాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరిస్తున్నారు.

తొలుత సంగీత కార్యక్రమాలు

హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు చెన్నైకి చెందిన నిత్యశ్రీ మహదేవన్ గ్రూప్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి 6:15 గంటల వరకు చెన్నైకి చెందిన ప్రియా సిస్టర్స్ అన్నమాచార్య సంకీర్తలను ఆలపించనున్నారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించనున్నారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కంకణాలు, శ్రీవారి పుస్తక ప్రసాదం, కల్యాణోత్సవం అక్షింతలు కలిపి ఒక బ్యాగ్‌లో పంపిణీ చేయనున్నారు. కల్యాణ వేదిక ప్రాంగణ ప్రాంతంలో ఐదు వేల ఫ్లడ్ లైట్లు, 25 జనరేటర్లు, 18 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీప అలంకరణల్లో దేవతామూర్తులను, ఆలయాన్ని తీర్చిదిద్దారు. పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, కలెక్టర్ నాగలక్ష్మి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సతీష్ కుమార్, సీఈ సత్యనారాయణ పలువురు జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

చెదిరిన రంగుల కల

- హోలీ వేడుకలో అపశ్రుతి
- కాలువలో జారి పడి బాలుడు దుర్మరణం
- రంగులు కడుక్కునేందుకు వెళ్లి నీటమునిగి మృతి

పెదకాకాని: హోలీ రంగులు కడుక్కునేందుకు కాలువ వద్దకు వెళ్లిన బాలుడు కడతేరిపోయాడు. తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చాడు. ఈ హృదయ విదారక ఘటన నంబూరులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండలంలోని నంబూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన దాసరి ఏసురత్నం, సాంబమ్మ దంపతులకు శృతి, జాషువా(13) సంతానం. శృతి డిగ్రీ చదువుతోంది. జాషువా స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. హోలీ సందర్భంగా శుక్రవారం బడికి సెలవు ఇవ్వడంతో జాషువా మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రంగులు చల్లుకున్నారు. దుస్తులపై పడిన రంగులు కడుక్కునేందుకు ఇంటికి సమీపంలో ఉన్న గుంటూరు చానల్ వద్దకు నలుగురూ వెళ్లారు. ఈ సమయంలో జాషువా కాలుజారి కాలువలో పడి నీటి ఉధృతికి మునిగిపోయాడు. దీంతో మిగిలిన స్నేహితులు ఇంటికి వెళ్లి పెద్దలకు విషయం చెప్పారు. బాలుడి జాడ కోసం రెండు గంటల పాటు స్థానికులు శ్రమించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత జాషువా మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో జాషువా తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.



మరణించిన విద్యార్థి జాషువా

భక్తజన సంద్రంగా శింగరకొండ



తిరనాళ్లకు తరలివచ్చిన భక్తులు

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ప్రసన్నాంజనేయ స్వామి 70వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి శింగరకొండ భక్తజన సంద్రంగా మారింది. ప్రసన్నాంజనేయ స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ రాజగోపురాలు, పరిసరాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ సెట్టింగులతో క్షేత్రం మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది. విద్యుత్ ప్రభపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన, భక్తుల రద్దీతో క్షేత్ర పరిసరాలు ఇరుకుగా మారాయి.

650 మంది పోలీసు బలగాలతో పర్యవేక్షణ

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 మంది ఎస్సైలు, 587 పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్ల ఇన్‌చార్జిగా చీరాల డీఎస్పీ మొయిన్ వ్యవహరించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి, సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు, మేదరమెట్ల పైలాన్ వద్ద, రేణింగవరం జాతీయ రహదారి నుంచి అద్దంకి వైపు భారీ వాహనాలను దారి మళ్లించారు. 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ సమీపంలో 10 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,000** గరిష్ఠం : రూ. **8,000**

మోడల్ ధర రూ. **8,800**

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ 'అనుబంధ' నియామకాలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని అనుబంధ విభాగాల రాష్ట్ర కమిటీలో నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లాకు చెందిన గాదె యశ్వంత్‌రెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా షేక్ జావీద్, ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిరంజన్ రెడ్డి మాచిరెడ్డిలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

- రాష్ట్ర ఐటీ విభాగ ఉపాధ్యక్షులుగా మందపాటి హరీష్‌రెడ్డిని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. ఈయన మంగళగిరి నియోజకవర్గానికి చెందిన వారు.

రేషన్ బియ్యం మూటలు స్వాధీనం



తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కలలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 16 రేషన్ బియ్యం మూటలను గురువారం అర్ధరాత్రి పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిడుముక్కల దర్గాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ మూటలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూటలను రేషన్ షాప్ నంబర్ 12కు అప్పగించినట్లు రెవెన్యూ ఆర్ఐ హనుమంతరావు వెల్లడించారు.

చర్లపలి-విశాఖపట్నం ప్రత్యేక రైలు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి-విశాఖపట్నం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నంబర్ 08579 విశాఖపట్నం-చర్లపల్లి ప్రత్యేక రైలు ఈనెల 16వ తేదీన, 08580 చర్లపల్లి-విశాఖపట్నం రైలు ఈనెల 17వ తేదీన కేటాయించినట్లు వివరించారు.

ఉత్కంఠ మిన్నంటెన్

- పదో తరగతి పరీక్షలకు సర్వంసిద్ధం
- చదువులో తలమునకలైన విద్యార్థులు
- సంసిద్ధంలో ఉపాధ్యాయులు నిమగ్నం
- తల్లిదండ్రుల్లోనూ ఉద్విగ్నం
- 17 నుంచి పరీక్షలు ప్రారంభం
- పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు



గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి చదువు కీలక దశకు చేరింది. సోమవారం పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విద్యార్థులు చదువులో తలమునకలై ఉండగా, వారిని సంసిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు నిమగ్నమై ఉన్నారు. బిడ్డల చదువులపై తల్లిదండ్రులూ ఉద్విగ్నక్షణాలు అనుభవిస్తున్నారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 30,410 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. వీరికోసం 150 కేంద్రాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది.

- హాల్‌టికెట్లు పొందిన విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించి రోజూ పరీక్షకు ఎలా వెళ్లాలి.. ఎంత సమయం ముందు ఇంటి నుంచి బయలుదేరాలనే అంశాలపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాల వద్ద ఉండేలా చూసుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 9.30 తరువాత పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని గుర్తుంచుకోవాలి.
- హాల్ టికెట్లపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.
- హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్ నంబరు ఆధారంగా కేటాయించిన గదులకు చేరుకోవాలి.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ఉంటుంది. అది ఉందో లేదో చూసుకోవాలి.
- పరీక్ష గదిలోకి ప్రవేశించగానే బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. ఇన్విజిలేటర్ సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఓఎంఆర్ షీట్ పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు గీయరాదు. వ్యర్థ రాతలు రాయరాదు.
- ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, రాయబోవు పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలి.
- 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగుస్తుంది. ఈ మధ్య సమయంలో విద్యార్థులను బయటకు అనుమతించరు.
- గుర్తింపు కార్డు కలిగిన పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలనే పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు.
- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుశాఖ 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు విస్తృత రీతిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.
- ప్రశ్నపత్రం లీక్ అయిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా, విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరు కావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నపత్రం లీకేజీకి గురైతే, అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు. జాగ్రత్తగా ఉండాలి.
- ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్‌ప్రాక్టీసుగా పరిగణిస్తారు. జాగ్రత్తగా ఉండాలి.

విస్తృత ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశాం. భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉంటాయి. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి. పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

– సీవీ రేణుక, డీఈవో

గొలుసు చోరీలతో జల్సా

- ఏడుగురు దొంగల ముఠా అరెస్టు
- రూ.16.12 లక్షల విలువైన 162 గ్రాముల బంగారు గొలుసులు స్వాధీనం
- ఐదు మోటార్ సైకిళ్లు కూడా సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో ఏఎస్పీ సుప్రజ, తెనాలి డీఎస్పీ జనార్దనరావు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గొలుసు చోరీలతో జల్సాలు చేస్తున్న ఏడుగురు దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.16.12 లక్షల విలువైన సుమారు 162 గ్రాముల బంగారు గొలుసులు, ఐదు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), తెనాలి డీఎస్పీ జనార్దనరావుతో కలిసి కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఈ ఏడాది జనవరి 27న తెనాలికి చెందిన ఓ మహిళ చెంచు పేట బ్రిడ్జి వైపు నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకెళ్లి మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో తెనాలి మూడో పట్టణ సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు తెనాలి చినరావూరుతోట వాసి పోతర్లంక సాయిమాధవ్ ఈ చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతను జల్సాల కోసం తెనాలి చినరావూరుతోటకు చెందిన ఆరుగురితో ముఠాగా ఏర్పడి రెండేళ్లుగా ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. ద్విచక్ర వాహనాలనూ దొంగిలించినట్టు తెలుసుకున్నారు. ఈ సమాచారంతో మహమ్మద్ సమీర్, ధనావత్ హనుమంత్‌నాయక్, సయ్యద్ కరిముల్లా, షేక్ బారావలి అలియాస్ బారా, గీతాంజలి స్కూల్ రోడ్డులో ఉంటున్న షేక్ మాగ్బుల్, కొల్లిపర మండలం అన్నవరం గ్రామ వాసి అమర్తలూరి నానీని కూడా అదుపులోకి తీసుకున్నారు.

వయసు 19.. గొలుసులు తెంచడంలో నేర్పరి

19 ఏళ్ల సాయిమాధవ్ గొలుసులు తెంచడంలో నేర్పరి. ఇతనే సూత్రధారి. గొలుసులు తెంచేవాడు. మిగతావారు మోటార్‌సైకిళ్లతో సిద్ధంగా ఉండి ఇతడిని తీసుకుని పరారయ్యేవారు. దొంగిలించిన గొలుసులను తెనాలి గీతాంజలి స్కూల్ రోడ్డులో ఉంటున్న షేక్ మక్బూల్‌కు ఇచ్చి అతనికి తెలిసిన వారికి మాత్రమే అమ్మేవారు. ఆ నగదుతో అందరూ జల్సాలు చేసేవారు. ధనావత్ హనుమంతునాయక్‌పై గతంలో మోటారుసైకిల్ చోరీ కేసు, సస్పెక్ట్ షీట్ ఉంది. మిగిలిన వారిపై కేసులు లేవు. ఇటీవల తెనాలి మూడో పట్టణ పీఎస్‌తోపాటు బాపట్ల జిల్లా వేమూరు పీఎస్ పరిధిలోని చావలి గ్రామంలోనూ ఈ ముఠా గొలుసు చోరీలకు పాల్పడింది. చేబ్రోలులోనూ మోటారు సైకిల్, బంగారు గొలుసు దొంగిలించింది. దొంగలను పట్టుకున్న తెనాలి మూడో పట్టణ పీఎస్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు ప్రకాష్‌రావు, కరీముల్లా, కానిస్టేబుళ్లు పి.మురళీ, కె.బాబురావు, ఎస్.జైకర్, ఎన్.శ్రీనివాసరావు, డి.సురేష్‌బాబు, ఎ.అనిల్‌కు ఎస్పీ రివార్డులు అందించారు.

అట్టడుగువర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి

ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీం



ప్రసంగిస్తున్న ఆచార్య కాశీం

ఏఎన్‌యూ: అట్టడుగు వర్గాల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.కాశీం అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ బాబూ జగ్జీవన్‌రామ్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభలో ఆచార్య కాశీం కీలకోపన్యాసం చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ లక్ష్యం ఒక్కటేనన్నారు. ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.కోటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళా వందనం, విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి ఎ.భరత్‌భూషణ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆలోచనా విధానాలను వివరించారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షోపన్యాసం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కావలి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ నివేదిక సమర్పించారు. అనంతరం సదస్సు పరిశోధనా పత్రాల సావనీర్‌ను, బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.ఆనందబాబు రాసిన కర్మయోగి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

సారా రహిత రాష్ట్రం కోసమే నవోదయం-2



వివరాలు వెల్లడిస్తున్న డీసీ డాక్టర్ శ్రీనివాస్

తెనాలిరూరల్: సారా రహిత రాష్ట్రమే ధ్యేయంగా నవోదయం-2 కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలో బార్ షాపులు, వైన్ షాపుల లైసెన్సుదారులతో తెనాలి కొత్తపేటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీ, విధివిధానాలను వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గుంటూరు, పల్నాడు పరిధిలో మాచర్ల, నరసరావుపేట, క్రోసూరు, ఈపూరు, పిడుగురాళ్ల, గురజాల గ్రామాలను సారా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో 28 సారా కేంద్రాలను నిర్వీర్యం చేశామన్నారు. నవోదయం -2 కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ద్వారా సారా నిర్మూలనకు కృషి చేస్తామని చెప్పారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కె.అరుణకుమారి, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మారయ్యబాబు, తెనాలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటాచలం పాల్గొన్నారు.

మాణిక్యవేల్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు వేణుగోపాలరెడ్డి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్ (77) అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. అరండల్‌పేట 10/2వ అడ్డ రోడ్డులోని ఆయన నివాస గృహంలో సందర్శకుల సందర్శనార్థం ఉంచారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్.నూరిఫాతిమా, ఎమ్మెల్యేలు గల్లా మాధవి (పశ్చిమ), నసీర్‌అహ్మద్ (తూర్పు), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు ప్రముఖులు మాణిక్యవేల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాణిక్యవేల్ అంత్యక్రియలు కొరిటిపాడులోని శ్మశాన వాటికలో జరిగాయి. కుటుంబ సభ్యులు, ట్రిపుల్ ఎక్స్ సోప్ ఉద్యోగులు, సిబ్బంది పెద్దఎత్తున తరలివెళ్లారు.

నంది అవార్డులకు 2014లో గ్రహణం



మాట్లాడుతున్న దర్శకుడు దిలీప్‌రాజా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏపీలోని నందు (నంది అవార్డులు)లు అస్పష్టతకు గురైనట్లు మా-ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా వ్యాఖ్యానించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పేరుతో అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఏపీలో మాత్రం 2013 నుంచి నిలిపివేసిన నంది అవార్డుల ప్రదానంపై విధి విధానాలను ప్రభుత్వం రూపొందించాలని అన్నారు. నంది అవార్డులకు 2014 నుంచి గ్రహణం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుల ఎంపిక విధానంలో ప్రతిభను మాత్రమే గుర్తించాలని డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమను, సినిమా కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దర్శకులు నరేష్ దోనె, మణివరన్ పాల్గొన్నారు.

వైభవంగా శత చండీ మహా యాగం



త్రిశక్తి దుర్గా పీఠంలో యాగ నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, దేవీ ఉపాసకులు, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీ హనుమత్ స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతా అర్చణ, శత చండీ హోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్ర పుష్పం, అమ్మవార్లకు దశ విధ అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. బగలాముఖి, రాజశ్యామల, వారాహి హోమాలు, యోగిని మండప హోమాలు నిర్వహించారు. గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 6న ప్రారంభమైన పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శనివారంతో ముగియనుంది. ఆఖరి రోజు శనివారం సర్వతోభద్ర మండల హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, శాంతి హోమాలు, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, ప్రోక్షణ, వేదఆశీర్వచనం, పండితుల సత్కారాలు, అన్నదానం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హాజరుకానున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

రైతులను భాగస్వాములను చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో రైతులను భాగస్వాములను చేయాలని రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వార్షిక కార్యచరణ ప్రణాళికపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి జూమ్ కాల్ ద్వారా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ రసాయన వ్యవసాయం వల్ల పర్యావరణానికి తీవ్రంగా నష్టం కలుగుతుందని తెలిపారు. వాతావరణం కూడా అత్యవసరస్థితిని ఎదుర్కుంటుందని చెప్పారు. ఖరీఫ్ వార్షిక ప్రణాళిక, సార్వత్రిక సూత్రాలు, పలు జిల్లాల్లో వ్యవసాయ విధానాలు, రైతులు పండిస్తున్న ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్‌లో పండిస్తున్న పంటలు, రైతుల విజయ గాథలను వివరించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ, సెరీకల్చర్, హార్టీకల్చర్ తదితర శాఖల సమన్వయంతో కలిసి ప్రణాళికలను తయారు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నవధాన్యాలు సాగుభూమికి ఎంత మేలు చేస్తాయో వివరించారు. రైతులంతా పీఎండీఎస్ పద్ధతిని అవలంబించి సాగు చేయాలని సూచించారు. 30 రకాల విత్తన పద్ధతిని పాటిస్తే భూములు సారవంతమవుతాయని తెలిపారు. భూమి సంవత్సరమంతా పచ్చగా ఉంటే జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమై, చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, రాష్ట్ర శిక్షకురాలు శాంతి, జిల్లా శిక్షకుడు సైదయ్య, ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య, మేరి, స్వాతి పాల్గొన్నారు.

నూతన పారిశ్రామిక చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ఎంఎస్ఎంఈ ఏడీ డాక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి



మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి

బాపట్ల: నూతన పారిశ్రామిక విధానాలపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, సహకారాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధించవచ్చని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెఎల్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు, వాటిపై అవలంబించాల్సిన విధానాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించేందుకు కావాల్సిన వనరులపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి తెలుసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఇండస్ట్రియల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు తక్కువ పెట్టుబడి వ్యయంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని నాణ్యతతో కూడిన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో సబ్సిడీలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ పి.వీరయ్య, బాపట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్త్రీ, పురుషుల రాష్ట్ర ఖోఖో జట్టు ఎంపిక

జె.పంగులూరు: మండలంలోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన జాతీయ స్త్రీ, పురుషుల జట్టు ఎంపిక జరగనున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 100 మంది పురుషులు, 100 స్త్రీలు వరకు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో కోచ్‌లు, మేనేజర్లు, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొని ప్రతిభా వంతులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరిలో జరిగే 57 వ సీనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పంగులూరు గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతా రామిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 28 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో శాప్ అబ్జర్వర్, జిల్లా కార్యదర్శి బి. కాశీవిశ్వనాథరెడ్డి, అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, ట్రెజరర్ కె. హనుమంతరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టెక్నికల్ ఆఫీసర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని సీతారామిరెడ్డి తెలిపారు.